
గద్వాలలో వినాయకుని సంకల్పం తీసుకుంటున్న మహర్షి వాల్మీకి ప్రతిమలో మండపం


గద్వాలలో మట్టి గణపతికి పూజలు నిర్వహించిన జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత


ఉండవెల్లిలో మండపాలను పరిశీలిస్తున్న ఎస్ఐ శేఖర్


బల్గెరలో వినాయకుడికి పూజలు చేస్తున్న మాజీ జెడ్పీటీసీ దంపతులు

క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

కేటీదొడ్డి: జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హత ఉన్న వారు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తహసీల్దార్ హరికృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి కుటుంబ పెద్ద సహజ లేదా ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి ఈ పథకం ద్వారా రూ. 20 వేలు అందుతాయని తెలిపారు. మృతి చెందిన రెండు సంవత్సరాలలోపు కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బాధిత కుటుంబంలో పిల్లలు మైనర్ అయి ఉండాలని తెలిపారు. అంతోద్యయ అన్న బీమాయోజన, జనశ్రీ బీమాయోజన కింద లబ్ధిపొందిన వారు ఈ పథకానికి అర్హులు కాదని పేర్కొన్నారు.

సుధాకర్‌రెడ్డికి ఘననివాళి

మల్దకల్: భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి గురువారం మండల కేంద్రంలో సీపీఐ మల్దకల్ మండల కార్యవర్గ సభ్యుడు రంగన్న ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సురవరం సుధాకర్‌రెడ్డి పేదల పక్షాన పోరాడి ఎందరికో ఆదర్శంగా నిలిచాడన్నారు.

ఒకే వార్డులో ఓట్లను కేటాయించాలి

అయిజ: కుటుంబ సభ్యుల మొత్త ఓట్లను ఒకే వార్డులో కేటాయించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. గతంలో ఒక కుటుంబంలో కొందరు ఓటర్లు ఉంటే వారి పేర్లను వివిధ వార్డుల్లోని నమోదు చేశారన్నారు. స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో కుటుంబ సభ్యులు ఎంతమంది ఉన్నా ఒకే వార్డులో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, లక్ష్మణ్ శంకరన్న, నరసింహులు, తిరుమలేష్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం నాయకులకు సన్మానం

అయిజ: నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎంపికైన సుధాకర్, కోశాధికారిగా ఎంపికైన సోమశేఖర్లను గురువారం మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. బుధవారం జిల్లా కేంద్రంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రమాణం చేశారు. వారిని పట్టణంలోని పలువురు ప్రముఖులు అభినందించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శేఖర్, రంగన్న, సూర్యుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

యూరియా కోసం క్యూలైన్

అలంపూర్‌రూరల్: కొన్ని రోజుల నుంచి రైతులకు అందించే యూరియా పక్కదారి పడుతోందని వార్తలొస్తున్నాయి. దీంతో యూరియా కొరత ఏర్పడి రైతులు సెంటర్ల దగ్గర బారులు తీరుతున్నారు. అలంపూర్ మండలంలోని పీఏసీఎస్‌ల దగ్గర స్థానికి ఎస్ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేసి క్యూలైన్ ఏర్పాటు చేసి ఒక్కొక్కరికి యూరియా అందిస్తున్నారు.

యువకుడి దుర్మరణం

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై ఆగి ఉన్న బస్సును లారీ ఢీకొట్టడంతో యువకుడు దుర్మరణం చెందగా, మరొకరికి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్ఐ రవినాయక్ కథనం మేరకు.. హైదరాబాద్‌లోని అత్తాపూర్‌కు చెందిన ధీరజ్ కుమార్ (26) ఓ కంపెనీలో సిటీ స్కానింగ్ మిషన్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. చిత్తూరులోని కె.ఎల్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో సిటీ స్కానింగ్ మిషన్ రిపేరు నిమిత్తం వారం రోజుల క్రితం వెళ్లాడు. పని ముగిసిన అనంతరం బుధవారం రాత్రి ప్రైవేట్ ట్రావెల్‌కు చెందిన బస్సులో తిరుగుపయనమయ్యాడు. ఈ క్రమంలో 44వ జాతీయ రహదారిపై మునుగాల శివారులోకి రాగానే గురువారం తెల్లవారుజామున బస్సులోని ఓ ప్రయాణికుడు మూత్ర విసర్జనకు డ్రైవర్ రోడ్డు పక్కకు ఆపాడు. అదే దారిలో వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఆగి ఉన్న బస్సును వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు రోడ్డు కిందకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో బస్సు వెనక భాగం, లారీ ముందు భాగం పూర్తిగా నుజ్జు నుజ్జు కాగా, బస్సులో వెనక బెర్త్‌లో ఉన్న ధీరజ్ కుమార్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ప్రయాణికుడికి తీవ్ర గాయాలయ్యాయి. మిగితా ప్రయాణికులు తేలికపాటి గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ధీరాజ్ తండ్రి శ్రవణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గల్లి గల్లీలో గణపయ్య


గణేష్ మండపంలో పూజలు చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ కేశవ్ దంపతులు


ఎర్రవల్లిలోని పాఠశాలలో టేకు ఆకులతో చేసిన వినాయకుడు

సాక్షి, నెట్‌వర్క్: లంబోదరుడి నిజమైన ఆకారమే గజముఖం. అలాంటి గణనాథుడిని భక్తులు మరింత వినూత్న రీతిలో ఏర్పాటు చేశారు. ఒక్కో గణేష్ మండలి వారు ఆయా ఆకృతులలో వినాయకుడిని ప్రతిష్ఠించి ప్రత్యేకత చాటుకున్నారు.

- జిల్లా కేంద్రంలోని మార్కెండేయస్వామి ఆలయంలో పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో చేనేత మగ్గంపై వినాయకుడు కూర్చొని చీర నేయడంతో పాటు చీరల విక్రయాలు చేస్తున్నట్లు వినాయకుడి ప్రతిమను రూపొందించారు.
- వేదనగర్‌లోని శాంతిప్రియ యువజన సంఘం ఆధ్వర్యంలో వ్యాస మహర్షి వాల్మీకి రామాయణం రాయడానికి ముందు వినాయకుని సంకల్పం తీసుకున్నట్లు వివరిస్తూ గణేష్ ప్రతిమను ప్రతిష్ఠించారు.
- వేదనగర్ కాలనీలోని పాండురంగ స్వామి ఆలయంలో స్వకుళసాలి యువజన సంఘం ఆధ్వర్యంలో దేశంలో కొలువుదీరిన ద్వాదశ జ్యోతిర్లింగాలను వినాయకుడు దర్శించుకునే విధంగా ప్రతిమను తీర్చిదిద్దారు.
- గద్వాలలో ఆకార్ యూత్, టీటీ యూత్, టీం ఫైసా యూత్ తదితర సంఘాల ఆధ్వర్యంలో భారీ వినాయకులను ప్రతిష్ఠించారు.
- ఉండవెల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా గణనాథులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఐ శేఖర్ ప్రత్యేక పూజలు చేశారు.
- అయిజ మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు.
- కేటీదొడ్డి మండలంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.
- గట్టు మండలంలోని బల్గెరలో మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల, బీఆర్ఎస్ నాయకుడు బల్గెర హనుమంతునాయుడులు వినాయకునికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. గట్టులో భవాని ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.
- మానవపాడు మండలంలోని ఆయా గ్రామాలలో భక్తిశ్రద్ధలతో వినాయకుడికి పూజలు నిర్వహించారు.
- మల్దకల్, అమరవాయి, మల్దకల్, తాటికుంట, ఎల్కూరు, విఠలాపురం, కుర్తిరావులచెర్వు, మద్దెలబండ, బిజ్వారం, పాల్వాయి, సద్దలోనిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో నాయకులు, యువకులు గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు.
- అలంపూర్ మండల పరిధిలోని గ్రామాలలో 78 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినాయక మండపాల దగ్గర పోలీసులు ట్యాగింగ్ చేశారు.
- ఎర్రవల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడు, సరస్వతి పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన టేకు ఆకుల వినాయకుడు అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.
- శాంతినగర్ మండలం వడ్డేపల్లి పురపాలిక, మండలంలోని గ్రామాల్లో గణేషుడికి ప్రత్యేక పూజలు చేశారు.
- ఇటిక్యాల మండల కేంద్రంతో పాటుగా ఆయా గ్రామాలలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు.


ఇటిక్యాలపాడులో ప్రతిష్ఠకు గణనాథుడిని మోసుకెళ్తున్న భక్తులు


అలంపూర్‌లో వినాయక మండపాల దగ్గర ట్యాగింగ్ చేస్తున్న పోలీసులు


గద్వాలలో గణేష్ మండపంలో పూజలు నిర్వహించిన ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


సమావేశంలో మాట్లాడుతున్న హనీఫ్

గద్వాలటౌన్: జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం స్థానిక ఇండోర్ స్టేడియంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహారాజు, కోశాధికారిగా సింధురాణి, ఉపాధ్యక్షులుగా కృష్ణయ్య, శైలజ, సంయుక్త కార్యదర్శిగా మోహన్‌మురళీ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ఏర్పాటుకు ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శులు హనీఫ్, చెన్నవీరయ్య, రిటైర్డు ఫిజికల్ డైరెక్టర్లు వీరవసంతరాయుడు, ప్రకాష్, మోహన్ హాజరయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గానికి డీవైఎస్ఓ జితేందర్ సుభాకాంక్షలు తెలిపారు.

పోరాట ఫలితమే ఉచిత విద్యుత్

గద్వాల: 25 ఏళ్ల క్రితం వామపక్ష పార్టీలు చేసిన పోరాట ఫలితమే నేడు ప్రజలు అనుభవిస్తున్న ఉచిత విద్యుత్ అని సీపీఎం, సీపీఐ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు వెంకటస్వామి, ఆంజనేయులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గురువారం కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగంలో తీసుకొస్తున్న ప్రవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం జరిగే ఐక్య పోరాటాలలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యుత్ పోరాట అమరులకు నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పరంజ్యోతి, నరసింహ, దానయ్య, ప్రవీణ్, తిమ్మప్ప ఉన్నారు.

వార్డు ఆఫీసులు ఏర్పాటు చేయండి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మున్సిపాలిటీలో ప్రతి వార్డులో కార్యాలయం ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో ప్రస్తుతం 20 వార్డులు మాత్రమే ఉన్నాయని, పెరిగిన జనాభా దృష్టిలో ఉంచుకొని 30 వార్డులుగా పెంచాలని, ప్రతి వార్డులో వార్డు ఆఫీస్ పెట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, లక్ష్మణ్ గౌడ్, ఓబుల్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల వారీగా ఓటర్ల జాబితా విడుదల


వార్డుల జాబితా విడుదల చేసిన పంచాయతీ కార్యదర్శి సురేష్

కేటీదొడ్డి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం కేటీదొడ్డి మండలం ఉమిత్యాలతండా గ్రామంలోని పంచాయతీ కార్యదర్శి సురేష్ వార్డుల వారీగా ఓటర్ల డ్రాఫ్ట్ జాబితాను ప్రదర్శించారు. ఈ నెల 28 నుంచి 30 వరకు వార్డుల వారీగా ప్రకటించిన ఓటర్ల జాబితాలో ఏదైనా అభ్యంతరాలుంటే స్వీకరిస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో టీచర్ వినోద్, అంగన్‌వాడీ టీచర్, గ్రామస్తులు ఉన్నారు.

మల్దకల్: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన తుది ఓటరు జాబితాను గురువారం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తెలిపారు. ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే ఓటర్లు ఈనెల 30వ తేదీలోపు బీఎల్ఓలకు తెలియజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్, సూపరింటెండెంట్ నర్సన్న, సీనియర్ అసిస్టెంటు సూర్యప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

మానవపాడు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాఘవ ఓటరు జాబితాను నోటీసు బోర్డుపై ప్రదర్శించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాల: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ముసాయిదా ఓటర్ జాబితా విడుదల చేసినట్లు ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు అధికారులు పాల్గొన్నారు.

సరిహద్దులో తనిఖీ

అలంపూర్: రాష్ట్ర సరిహద్దులోని తెలంగాణ బార్డర్‌లో ఎరువుల కొరత ఉండడంతో సరిహద్దులు దాటుతున్నాయని తెలపడంతో పుల్లూరు టోల్‌ప్లాజాలో ఎస్ఐ శేఖర్, పోలీసులు తనిఖీ నిర్వహించారు. రైతులకు యూరియా అందడం లేదని తెలియడంతో పటిష్ట భద్రత ఏర్పాటు చేసి లారీలను, కంటైనర్లను తనిఖీ చేశారు.

కమిషనర్‌కు వినతి

అలంపూర్ రూరల్: మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాల అమలు వంటి సమస్యలపై యూనియన్ అధ్యక్షుడు శేషన్న ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శంకర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాలుగు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మీనారాయణ, బాలరాజ్, రమేష్ నాయుడు ఉన్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు


ఉధృతంగా పారుతున్న బైరంపల్లి వాగు


ఉండవెల్లి-బుడిదపాడు మధ్య ఉధృతంగా పారుతున్న వాగు

అలంపూర్‌రూరల్: అలంపూర్ మండలంలో గురువారం కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. బైరంపల్లి వాగు, కాశీపూర్ పల్లాగు వాగు నుంచి రోడ్లపై నీళ్లు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఉండవెల్లి: మండలంలో కురిసిన వర్షానికి ఉండవెల్లి-బుడిదపాడు వాగు ఉప్పొంగింది. ఉండవెల్లి-చిన్న ఆముదాలపాడు వాగు ఉప్పొంగి ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలు దారి మార్చి కంచుపాడు మీదుగా వెళ్లారు.

ఇసుక లారీలతో రోడ్లు ధ్వంసం

మానవపాడు: ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా గ్రామాల్లో రోడ్లను ధ్వంసం చేస్తోంది. పరిమితికి మించి లారీలలో అధికలోడుతో ఇసుకను తరలిస్తూ రోడ్లు, బ్రిడ్జిలు కూలిపోయే ప్రమాదం ఏర్పడుతోంది. మంగళవారం రాత్రి ఆంధ్రప్రదేశ్ అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి జోగుళాంబ గద్వాల జిల్లా టోల్‌గేట్‌ను, మానవపాడు మండలంలోని బార్డర్ చెక్‌పోస్టు తప్పించి.. చెన్నిపాడు, మానవపాడు, గోకులపాడు మీదుగా అనుమతి లేకుండా ఇసుకను లారీల్లో తరలిస్తున్నారు. దీంతో గోకులపాడు రోడ్లు, గోకులపాడు బ్రిడ్జి కులింది. గ్రామానికి చెందిన 50మందికి పైగా బ్రిడ్జిపై నిరసన చేపట్టారు. కొందరు గ్రామస్తులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. లారీ డ్రైవర్ గ్రామస్తులతో దురుసుగా ప్రవర్తించడంతో గొడవ జరిగినట్లు సమాచారం. ఈ ఘటనపై ఎస్ఐ చంద్రకాంత్‌ను వివరణ కోరగా, అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను పట్టుకోని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పశువుల చోరీ: ముగ్గురికి రిమాండ్

కేటీదొడ్డి: గద్వాల నియోజకవర్గంలో కొంత కాలంగా జరిగిన పశువుల చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గురువారం రాత్రి కేటీదొడ్డి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మండలంలోని ఉమిత్యాల గ్రామానికి చెందిన రైతుకు చెందిన రెండు ఎద్దులు, ఒక ఆవు జూన్ 23న దొంగలించబడ్డాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేటీదొడ్డి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గద్వాల ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు గద్వాల సీఐ టంగుటూరి శ్రీను పర్యవేక్షణలో ప్రత్యేక బృందంగా ఏర్పడ్డారు. సీసీ కెమెరాల ఆధారంగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. సిందనూర్‌కు చెందిన గురాన్, బళ్లారి జిల్లాలోని కొళ్లగల్ కు చెందిన సలీం ఇద్దరు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. పశువుల మాంసానికి బెంగుళూరులో డిమాండ్ ఉండటంతో రాత్రివేళలో వివిధ ప్రాంతాలలో పశువులను చోరీ చేసి బొలెరాలో బెంగుళూరు సమీపంలో చింతమణి వద్ద నివస్తున్న సోహైల్ అనే వ్యక్తికి విక్రయించి డబ్బులు సంపాదించేవారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోని, వారి నుంచి రూ.4,30,000 ఒక అశోక్ లైలాండ్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో పశువుల అపహరణ మొత్తం 7 కేసులు నమోదు కాగా, అందులో కేటీదొడ్డి మండలంలోని ఉమిత్యాలలో రెండు ఎద్దులు ఒక ఆవు, గద్వాలలో రెండు ఎద్దులు, పరుమాల వద్ద రెండు ఎద్దులు, శెట్టి ఆత్కూరు వద్ద రెండు ఎద్దులు, జాంపల్లి వద్ద రెండు ఎద్దులు, ఒక బర్రె, పెద్దపాడు గ్రామంలో రెండు ఎద్దులు, అపహరించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు

గట్టు: మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. బింగిదొడ్డి తండా ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్న హనుమంతు నాయక్ స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందడంతో మాచర్ల ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. పీఎస్ బస్వాపురంలో పని చేస్తున్న ఎస్‌జీటీ చంద్రకాంత్ వదన్ ఆరగిద్ద ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పదోన్నతి పొందారు. పీఎస్ మాచర్లలో పని చేస్తున్న ఎస్‌జీటీ రంగన్న అంతపల్లికి యూపీఎస్‌కు స్కూల్ అసిస్టెంట్‌గా వెళ్లారు. పీఎస్ ముచ్చోనిపల్లెలో ఎస్‌జీటీగా పని చేస్తున్న రామాంజనేయులు, ఇందువాసి ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా వెళ్లారు. ఇతర మండలాలకు చెందిన ఇద్దరు పదోన్నతిపై గట్టు మండలానికి వచ్చినట్లు తెలిపారు. ఉండవెల్లి నుంచి రాణిలీలావతి మిట్టదొడ్డి పీఎస్‌కు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా, జెడ్పీహెచ్ఎస్ చింతలకుంట నుంచి సుభ ఎంపీహెచ్ఎస్ బోయలగూడెంకు పదోన్నతిపై వచ్చినట్లు ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

రెండు ఇసుక లారీల పట్టివేత

ఎర్రవల్లి: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను అదుపులోకి తీసుకున్నట్లు కోదండాపురం ఎస్ఐ మురళి గురువారం తెలిపారు. అనంతపురం జిల్లాలోని తాడిపత్రి నుంచి హైదరాబాద్‌కు ఎలాంటి అనుమతి లేకుండా రెండు లారీలలో ఇసుకను తరలిస్తున్నారు. జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి విధులు నిర్వహిస్తున్న కోదండాపురం పీఎస్ బ్లూకోర్టు సిబ్బంది లారీలను తనిఖీ చేసి అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించారు. వారి ఫిర్యాదు మేరకు ఇరు లారీల డ్రైవర్లు లక్ష్మన్, లింగారం రాజు, లారీల ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడు శివారులోని జాతీయ రహదారిపై తాడిపర్తి జిల్లా రాజాపూర్ నుంచి అక్రమంగా కర్నూల్‌కు ఇసుక లారీని తరలిస్తుండగా బ్లూకోర్టు పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అను మతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

ఇటిక్యాల: భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీఎస్పీ అధ్యక్షుడు రాంబాబు అన్నారు. బుధవారం మునగాల గ్రామ శివారులో దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట శివన్న, రాజు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని యాక్తాపురంలో వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు.

లారీని ఢీ కొట్టిన బస్సు

అలంపూర్: జాతీయ రహదారి పుల్లూరు టోల్‌ప్లాజా సమీప మార్గంలో హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు ప్రయాణిస్తున్న బస్సు, ఆగి ఉన్న లారీని బుధవారం ఢీ కొట్టడంతో క్లీనర్‌కు, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ఉన్న 24 మందికి ఎలాంటి గాయాలు కాలేదని, బస్సు దెబ్బతిన్నట్లు తెలిపారు.

గురుకులంలో సమస్యలు

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని జ్యోతిబాపులే గురుకుల విద్యాలయంలో అనేక సమస్యలున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, దీంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతారని ప్రిన్సిపాల్ రామకృష్ణకు బీఆర్ఎస్వీ జిలా కోఆర్డినేటర్ పల్లయ్య తెలిపారు.